పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ నారాయణ రెడ్డి

వికారాబాద్, మార్చి 23 : పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని వికారాబాద్ కలెక్టర్ నారాయణరెడ్డి చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. శనివారం పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో వికారాబాద్‌లోని బ్రిలియంట్ పాఠశాలలో కొనసాగుతున్న పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల్లో తిరుగుతూ, పరీక్ష నిర్వహణ తీరును నిశితంగా కలెక్టర్ గమనించారు. విద్యార్థులకు కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని తెలిపారు. పరీక్షల్లో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, తూచా తప్పకుండా నిబంధనలు అమలయ్యేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సూచించారు. పాఠశాల ఆవరణలో అంగవైకల్యం కలిగిన విద్యార్థి పరీక్షను సహాయకుడి(స్క్రైబర్)తో రాయిస్తున్న విధానాన్ని కలెక్టర్ పరిశీలించి సహాయకుడి విద్యార్హత గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

జిల్లావ్యాప్తంగా 80 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు తాగునీటితోపాటు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు. 13,411 మంది విద్యార్థులకు 13,349 మంది., ప్రైవేటు 10వ తరగతి పరీక్షలకు 1,383 మంది విద్యార్థులకు 1,304 మంది హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

వికారాబాద్‌లోని బ్రిలియంట్ పాఠశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సైలెంట్ కిల్లర్ టీబీ

నేడు ప్రపంచ టీబీ దినం

- ఏటా లక్షల మంది వ్యాధికి బలి
- సరైన చికిత్స తీసుకోకపోవడం, అవగాహన లేమి, పోషకాహార లోపంతో పెరుగుతున్న కేసులు
- క్రమపద్ధతిలో మందులు వాడితే పూర్తిగా నయం
- వికారాబాద్ జిల్లాలో 1946 కేసులు

'టీబీని అంతం చేయగలం' అని రాసి ఉన్న ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వైద్య సిబ్బంది

బొంరాస్‌పేట, మార్చి 23 : క్షయ వ్యాధికి నిశ్శబ్ద హంతకి(సైలెంట్ కిల్లర్) అని పేరు. ట్యూబర్‌క్యులోసిస్ అనే బ్యాక్టీరియాతో ఒకరి నుంచి ఒకరికి వ్యాపించే ఈ వ్యాధితో ఏటా ప్రపంచంలో లక్షల మంది మృత్యువాత పడుతున్నారు. ప్రాణాంతకమైన ఈ వ్యాధి నిర్మూలనకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎంతో కృషి చేస్తున్నా ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడం, వ్యాధి నిర్ధారణ అయిన తరువాత క్రమ పద్ధతిలో మందులు వాడకపోవడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో ఏటా క్షయవ్యాధి కేసులు పెరుగుతున్నాయి. వ్యాధి గ్రస్తులు క్రమ పద్ధతిలో మందులు వాడి, మంచి పోషకాహారం తీసుకుంటే టీబీ వ్యాధి పూర్తిగా నయమవుతుందని వైద్యాధికారులు చెబుతున్నారు. టీబీ నిర్ధారణకు నేడు ప్రభుత్వం అధునాతన యంత్రాలను ఉపయోగిస్తున్నది. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా మందులు అందజేసున్నది. చికిత్స పూర్తయ్యే వరకు రోగికి రూ.3 వేలను ప్రభుత్వమే అందజేస్తున్నది. ప్రపంచ టీబీ దినం సందర్భంగా కథనం.

జిల్లాలో 1946 కేసులు

వికారాబాద్ జిల్లాలో ప్రస్తుతం 1946 మంది టీబీ రోగులు ఉన్నారు. 2023లో 1930 మంది రోగులను గుర్తించాలని లక్ష్యం పెట్టుకోగా 20,760 మందికి తెమడ పరీక్షలు నిర్వహించి 1946 మంది రోగులను గుర్తించారు. ఈ ఏడాది జనవరి నుంచి మార్చి 23 వరకు 5800 మందికి తెమడ పరీక్షలు నిర్వహించి 335 మంది రోగులకు టీబీ ఉన్నట్లు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. వ్యాధి తీవ్రతను బట్టి ఆరు నెలల నుంచి ఏడాది వరకు చికిత్సను అందిస్తున్నారు. మల్టీ డ్రగ్ రెసిస్టెంట్(ఎండీఆర్) టీబీ రోగులకు రెండేండ్ల పాటు చికిత్సను అందిస్తున్నారు. వైద్యులు సూచించిన విధంగా క్రమం తప్పకుండా మందులు తీసుకుంటూ, మంచి పోషకాహారం తీసుకుంటే టీబీ పూర్తిగా నయమవుతుంది. చికిత్స తీసుకున్నన్ని రోజులు రోగికి నెలకు రూ.500 చొప్పున రూ.3 వేలు ప్రభుత్వమే ఆర్థిక సహాయం చేస్తున్నది. క్షయవ్యాధి రోగులకు జిల్లాలో గత ఏడాది స్వచ్ఛంద సంస్థల వారు, ప్రజా ప్రతినిధులు నిక్షయ పోషణ పథకం కింద 76 మందికి పోషకాహార కిట్లు అందజేశారు. నేటికి కూడా జిల్లాలోని 'మా శారద' హాస్పిటల్ వారు ప్రతి నెలా 20 మంది రోగులకు పోషకాహార కిట్లను అందజేస్తున్నారు.

వ్యాధి వ్యాప్తిని అరికట్టడానికి టీపీటీ

టీబీ వ్యాప్తిని అరికట్టడానికి వైద్య ఆరోగ్య శాఖ టీబీ ప్రివెంటివ్ థెరపీ(టీపీటీ)ని అమలుచేస్తున్నది. ఒక ఇంట్లో ఒక వ్యక్తికి క్షయ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే ఆ రోగి నుంచి వ్యాధి ఇతరులకు సోకకుండా ఉండేందుకు ఐఎన్‌హెచ్ 300 ఎంజీ మాత్రలను అందజేస్తున్నారు. రోగి తప్ప ఆ కుటుంబంలో నివారు ఆరు నెలలపాటు రోజుకు ఒక మాత్ర చొప్పున వేసుకోవాలి. దీనిద్వారా ఇతరులకు టీబీ సోకకుండా ఉంటుంది. క్షయ వ్యాధి నివారణకు జిల్లాలోని గ్రామాల్లో వైద్యారోగ్య శాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వారానికి మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే తెమడ పరీక్షలు చేయించుకోవాలని ప్రచారం చేస్తున్నారు. 2025 నాటికి టీబీ ముక్త్ భారత్ పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాధి నిర్మూలను కృషి చేస్తున్నాయి. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు కూడా 'అవును టీబీని అంతం చేయగలం'(ఎస్ వీ కెన్ ఎండ్ టీబీ) అనే థీమ్‌తో పని చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు జిల్లా అధికారులు వికారాబాద్ జిల్లాలోని ఉడిమేశ్వరం(కొడంగల్), మోత్కూర్(దోమ), మమదాన్‌పల్లి(నవాబుపేట), పులిగుండ్ల(మర్పల్లి), కొత్తాపూర్ కుర్దు(తాండూరు) గ్రామాలను టీబీ ముక్త్ గ్రామాలుగా గుర్తించారు. ఎన్నికల కోడ్ ముగిసిన తరువాత ఈ గ్రామాలకు కలెక్టర్ అవార్డులను అందజేయనున్నారు.



టీబీ నిర్మూలనకు కృషి

జిల్లాలో టీబీ నిర్మూలనకు కృషి చేస్తున్నాం. ఏటా లక్ష్యానికి మించి తెమడ పరీక్షలు చేస్తున్నాం. వ్యాధి నిర్ధారణ అయిన రోగులకు ఉచితంగా మందులు, ఆర్థిక సహాయం అందజేస్తున్నాం. మందులను క్రమం తప్పకుండా వాడే విధంగా ఆశ కార్యకర్తల ద్వారా పర్యవేక్షిస్తున్నాం. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ప్రజల్లో వ్యాధిపట్ల సరైన అవగాహన లేకపోవడం, సరైన పోషకాహారం తీసుకోకపోవడం, వలసల వల్ల కేసులు పెరుగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యాధిపై అవగాహన పెంచుకుని సకాలంలో చికిత్స తీసుకుంటే టీబీ పూర్తిగా నయమవుతుంది.

- డాక్టర్ రవీంద్రయాదవ్, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి

వ్యాధి నిర్ధారణ

టీబీ వ్యాధి నిర్ధారణకు జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో అధునాతన యంత్రాలు, పద్ధతులను అవలంబిస్తున్నారు. సీబీనాట్, ట్రూనాట్ పద్ధతిలో అనుమానితుల నుంచి తెమడను సేకరించి యంత్రాల్లో ఉంచితే రెండు గంటల్లోనే వ్యాధి నిర్ధారణ అవుతుంది. ఈ యంత్రాల్లో ఒకేసారి ఎనిమిది మంది నుంచి సేకరించిన తెమడను పరీక్షించవచ్చు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ దవాఖానల్లో ఉచితంగా తెమడ పరీక్షలను నిర్వహిస్తున్నారు.

హిందువులపై దాడి అమానుషం

దాడిని ఖండిస్తూ నిరసన తెలుపుతున్న హిందూ బంధువులు

వికారాబాద్, మార్చి 23 : బెంగళూరులో హనుమాన్ చాలీసా చదువుతున్న హిందూ బంధువులపై జరిగిన దాడికి నిరసనగా హనుమాన్ చాలీసా చదివి నిరసన తెలిపామని 'మా శారద' ఆసుపత్రి వ్యవస్థాపకుడు డాక్టర్ రాజశేఖర్ అన్నారు. శనివారం వికారాబాద్ న్యూ గంజ్‌లోని వీర హనుమాన్ మందిరంలో వికారాబాద్, మండల పరిధిలోని హిందూ బంధువులు పెద్దసంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా చదివి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ బంధువులందరినీ జాగృతపరచడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. హిందువులందరూ ఐకమత్యంతో ఏ సంఘటనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. హిందువులపై దాడులు చేయడం సార్వభౌమత్వానికి గొడ్డలి పెట్టని ఘాటుగా స్పందించారు. హిందువుల్లో ఉండే సహనం, జాలి, దయ వీటిని బలహీనతలుగా ఇతరులు తీసుకోరాదని హెచ్చరించారు. హిందువుల స్వేచ్ఛకు, రాజ్యాంగపరంగా ఇచ్చిన హక్కులకు భంగం కలిగితే హిందూ సమాజం తన గొంతెత్తి ప్రశ్నిస్తుందని చెప్పారు. సుప్రీంకోర్టు పేర్కొన్న గైడ్‌లైన్స్‌లో ప్రార్థన స్థలాల నుంచి కానీ.. ఇతర స్థలాల్లో జరిగే సమావేశాల్లో వాడే లౌడ్ స్పీకర్లకు వాల్యూమ్ కంట్రోల్ ఉండాలని చెప్పిందని గుర్తు చేశారు. హిందూ సంఘాలు కలెక్టర్‌ను, ఎస్పీని కలిసి రిప్రజెంటేషన్ ఇవ్వాలని ఆయన సూచించారు.

బీసీ జోడో యాత్రను ప్రారంభిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

బీసీ జోడో యాత్ర షురూ..

ముషీరాబాద్, మార్చి 23 : బీసీల డిమాండ్లు పరిష్కరించాలని జాతీయ బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన బీసీ జోడో యాత్రలను శనివారం రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రారంభించారు. విద్యానగర్‌లోని బీసీ భవన్ నుంచి చేపట్టిన బీసీ జోడో యాత్రను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. అనంతరం కృష్ణయ్య మాట్లాడుతూ.. పార్లమెంటు ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు పది సీట్లు ఇవ్వాలని, బీసీ డిమాండ్లపై విధానపరమైన ప్రకటన చేసి తమ మేనిఫెస్టోలలో చేర్చాలని డిమాండ్ చేశారు. 15 లక్షల ఉద్యోగాల భర్తీకి సానుకూలంగా ఉన్న పార్టీలకే మద్దతు ఇస్తామని, బీసీలకు టికెట్లు ఇచ్చిన పార్టీలకే ఎన్నికల్లో అండగా నిలుస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నామినేటెడ్ పోస్టుల భర్తీలో బీసీలకు తీరని అన్యాయం చేసిందని, సంపన్న వర్గాలకు పెద్ద పీట వేసిందని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి ప్రత్యేక బడ్జెట్ కేటాయించడానికి కేంద్ర ప్రభుత్వానికి మనసు రావడం లేదని, ఓట్లు వేసే యంత్రాలుగా చూస్తూ బీసీలకు తీరని ద్రోహం చేస్తున్నదని విమర్శించారు. ఫీజు బకాయిలు, ఉపకార వేతనాల చెల్లింపులో రాష్ట్ర సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని, పేద, బలహీన వర్గాల విద్యార్థులను చదువుకు దూరం చేసే కుట్రలు పన్నుతున్నదని పేర్కొన్నారు. జాతీయ బీసీ యువజన సంఘం అధ్యక్షుడు గవ్వల భరత్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, నందగోపాల్, రాజ్ కుమార్, అంజి, ప్రవీణ్ ముదిరాజ్, ఉదయ్, రోహిత్, నాగరాజు, లోకేష్ పాల్గొన్నారు.

మెట్రో ఎండీకి మేనేజర్ ఆఫ్ ది ఇయర్ పురస్కారం

ఎన్వీఎస్ రెడ్డికి అవార్డును అందజేస్తున్న ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, చిత్రంలో పలువురు ప్రముఖులు

సిటీబ్యూరో, మార్చి 23(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో రైలు ఎం.డీ ఎన్వీఎస్ రెడ్డి 'మేనేజర్ ఆఫ్ ది ఇయర్' అవార్డును అందుకున్నారు. నగరంలో హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ఈ అవార్డును ఎన్వీఎస్ రెడ్డికి అందజేశారు. 40 ఏండ్లకు పైగా అనేక ప్రభుత్వ సంస్థల ద్వారా రాష్ట్రంలో పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను విజయవంతంగా నిర్వహించారని, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్‌గా అసాధారణ నాయకత్వ పటిమతో ప్రపంచంలోనే అతి పెద్ద పొడవైన మెట్రో ప్రాజెక్టును పీపీపీ విధానంలో పూర్తి చేశారని మంత్రి పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో తలెత్తిన అనేక సున్నితమైన సమస్యలు, ఆందోళనలను అసాధారణ రీతిలో ఎదుర్కొంటూ, ఒక సందర్భంలో అసాధ్యం అనుకున్న మెట్రో ప్రాజెక్టును విజయపథంలో నడిపించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షుడు జయవంత్ నాయుడు, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి.జె.రావు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి డ్రాప్ రో బాల్ జట్టుకు తెలంగాణ క్రీడాకారుల ఎంపిక

తుర్కయాంజాల్, మార్చి 23 : జాతీయ స్థాయి డ్రాప్ రో బాల్ జట్టుకు తెలంగాణ నుంచి వివిధ జిల్లాలకు చెందిన 18 మంది క్రీడాకారులు ఎంపికైనట్లు తెలంగాణ రాష్ట్ర డ్రాప్ రో బాల్ అసోసియేషన్ కార్యదర్శి ఎండీ రహమత్ తెలిపారు.ఇటీవల తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కేబీ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్ర స్థాయి 3వ సీనియర్ బాలుర-బాలికల డ్రాప్ రో బాల్ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీల నుంచి 18 మంది క్రీడాకారులను జాతీయ స్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 2వ వరకు హర్యానాలోని శ్రీకృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ కురుక్షేత్రలో జరిగే 14వ సీనియర్ డ్రాప్ రో బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో అబ్జర్వర్స్ కమిటీ కార్యదర్శి అక్బర్ బాబా, చీదేడు సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలయ్యను చితకబాదుతున్న రవి

అప్పు చెల్లించలేదని చితకబాదాడు

తాండూరు, మార్చి 23 : తీసుకున్న అప్పు చెల్లించలేదని ఓ వ్యక్తిని సభ్య సమాజం తలదించుకునే విధంగా చితకబాదిన దాష్టిక సంఘటన వికారాబాద్ జిల్లా తాండూరులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. తాండూరు పట్టణ సమీపంలోని రాజీవ్ కాలనీలో నివాసముంటూ ఆటో డ్రైవర్‌గా చేస్తున్న బాలయ్య తాండూరు పట్టణం గాంధీనగర్‌కు చెందిన మ్యాదరి రవి వద్ద వ్యక్తిగత పనుల నిమిత్తం రూ.5000 అప్పుగా తీసుకున్నాడు. అయితే మూడు నెలలుగా వడ్డీ చెల్లించకపోవడంతో ఇంటికి పిలిపించి ఇష్టం వచ్చినట్లు చితకబాదాడు. దీంతో బాధితుడు తాండూరు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో వ్యాపారి రవిపై కేసు నమోదు చేసినట్లు తాండూరు సీఐ సంతోష్ కుమార్ తెలిపారు. మరోవైపు అప్పు తీసుకున్న వ్యక్తిని కొడుతున్న వీడియో వైరల్ కావడంతో ప్రజలందరూ రవి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భరత్‌కుమార్‌యాదవ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ధాత్రీదేవి

బాటసింగారం రైతు సేవా సహకార సంఘం నూతన చైర్మన్‌గా భరత్‌కుమార్‌యాదవ్

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 23: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం నూతన చైర్మన్‌గా చేగూరి భరత్‌కుమార్ యాదవ్ ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని సంఘం ప్రధాన కార్యాల యంలో శనివారం ఇన్‌చార్జి చైర్‌పర్సన్ నార్లకొండ మల్లమ్మాజంగమయ్య యాదవ్ అధ్యక్షతన రంగారెడ్డి జిల్లా సహకార సంఘం అధికారిణి ధాత్రీదేవి సమక్షంలో నూతన చైర్మన్ ఎన్నిక సమావేశాన్ని నిర్వహించారు. 9 మంది డైరెక్టర్లు తారామతిపేట గ్రామానికి చెందిన భరత్ కుమార్‌యాదవ్‌ను చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భరత్‌కుమార్ యాదవ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ధాత్రీదేవి ప్రకటించారు. ఈ సందర్భంగా చైర్మన్ భరత్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ.. పాలకవర్గ సభ్యుల సహకారంతో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో డైరెక్టర్లు జైపాల్‌రెడ్డి, మహేందర్ రెడ్డి, చిన్నయాదిరెడ్డి, బాలనర్సింహ, రాములు, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మమ్మ, మేనేజర్ ఐలేష్‌యాదవ్ తదితరులున్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను జేసీబీ సహాయంతో తొలగింపజేస్తున్న రెవెన్యూ సిబ్బంది

అక్రమ నిర్మాణాల కూల్చివేత

తుర్కయాంజాల్, మార్చి 23 : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధి ఇంజాపూర్ గూడెం కుంట సర్వే నం.90, 99లో ఎఫ్‌టీఎల్ ప్రాంతాన్ని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను అబ్దుల్లాపూర్‌మెట్ ఎమ్మార్వో రవీందర్ దత్తు ఆదేశాల మేరకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు సంయుక్తంగా శనివారం జేసీబీ సహాయంతో తొలగించారు. ఎఫ్‌టీఎల్ పరిధి, బంఫర్ జోన్‌లను కబ్జా చేసి నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎమ్మార్వో హెచ్చరించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఉష, ఏఈ రజా, ఆర్ఐ భిక్షపతి, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యాచారం : మండలంలోని బొల్లిగుట్టతండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం హోలీ ఉత్సవాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులు రసాయన రంగులు కాకుండా సహజ సిద్ధమైన రంగులు చల్లుకున్నారు. హోలీ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రధానోపాధ్యాయుడు నర్సింహ విద్యార్థులకు సూచించారు.

అమ్మో.. నిమ్మ..

- దిగిరానంటున్న ధరలు
- హోల్‌సేల్ మార్కెట్‌లో వంద నిమ్మకాయలకు రూ.400
- ఒక్కో నిమ్మకాయకు రూ.10
- వేసవి కావడంతో పెరుగుతున్న డిమాండ్

ఇబ్రహీంపట్నంరూరల్, మార్చి 23 : అన్ని రకాల నిత్యావసర ధరలు ఆకాశన్నంటుతున్నాయి. ఆ కోవలోకి ఇప్పుడు నిమ్మకాయలు కూడా వచ్చి చేరాయి. సామాన్యులు కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. వేసవి ప్రతాపానికి తోడు రంజాన్ మాసం ప్రారంభం కావడంతో నిమ్మకాయల వినియోగం పెరిగింది. డిమాండ్‌కు సరిపడా సరఫరా లేకపోవడంతో రోజురోజుకూ రేట్లు పెరిగిపోతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.10కి ఒక్క నిమ్మకాయ, వంద నిమ్మకాయలకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో నిమ్మకాయ నీళ్లు, సోడ, లెమన్ టీలు ధనవంతుల డ్రింక్‌గా మారిపోయాయి. గతేడాది నిమ్మ సోడ రూ.10 నుంచి రూ.15ఉండగా.. ఈ ఏడాది ఏరియాను బట్టి రూ.20 నుంచి రూ.30 వరకు అమ్ముతున్నారు. లెమన్ టీ ధరలను కూడా అమాంతం పెంచేశారు. లెమన్ టీ తయారీని నిమ్మకాయ ధరలు తగ్గేవరకు కొన్ని రోజులు నిలిపివేయనున్నట్లు చిరువ్యాపారులు చెబుతున్నారు. మార్చి మొదటి వారంలో రూ.200 ఉన్న నిమ్మకాయల ధరలు వారం రోజుల్లోనే రెండింతలు పెరిగి రూ.400లకు చేరింది. వేసవితాపం అధికమవ్వడంతో డిమాండ్ పెరగడం.. దానికి అనుగుణంగా ఉత్పత్తి లేకపోవడం, రవాణా చార్జీలు అధికమవడం తదితర కారణాలు వెరసి వాటి ధరలు సామాన్యుడికి అందనంత ఉన్నాయి. రాబోయే నెల రోజుల పాటు ధరలు మరింత పెరిగే అవకాశమందని స్థానిక వ్యాపారులు అంటున్నారు.

వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 23: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు పరీక్షల విభాగం, కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంబీఏ (ఈవినింగ్) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ.300 అపరాధ రుసుముతో వచ్చే నెల 6వ తేదీలోగా చెల్లించవచ్చన్నారు. ఎమ్మెస్సీ (స్పోర్ట్స్ న్యూట్రిషన్), ఎమ్మెస్సీ (అప్లైడ్ న్యూట్రిషన్) కోర్సుల మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షా ఫీజును వచ్చే నెల 3వ తేదీలోగా, రూ.300 అపరాధ రుసుముతో 8వ తేదీలోగా చెల్లించాలన్నారు. ఉస్మానియా లాంగ్వేజ్ సర్టిఫికెట్ కోర్సు, ప్రీ డిగ్రీ కోర్సు, బీఏ లాంగ్వేజెస్, ఎంఏ లాంగ్వేజెస్ తదితర కోర్సుల రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 16వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చన్నారు. రూ.500 అపరాధ రుసుముతో 22వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షా తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్షా తేదీల ఖరారు

విదేశీ భాషల డిప్లొమా కోర్సుల పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ప్రొ. రాములు తెలిపారు. ఫ్రెంచ్, జర్మన్ భాషల్లో జూనియర్, సీనియర్, అడ్వాన్స్‌డ్ పీజీ డిప్లొమా కోర్సుల పరీక్షలను వచ్చే నెల 2వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

పీజీడీ ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ ఫలితాల విడుదల

పీజీ డిప్లొమా ఇన్ వేదిక్ ఆస్ట్రాలజీ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. దూర విద్యా విధానంలో అందించే ఈ కోర్సు సెమిస్టర్ ఫలితాలను విడుదల చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పలు కోర్సులు, పరీక్షా తేదీల, మిగతా పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీ నైజం

- నిర్బంధాలు ఎక్కువైతే తిరుగుబాట్లు తప్పవు
- సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి జంగయ్య

శంషాబాద్ రూరల్, మార్చి 23: ప్రతిపక్షాల గొంతు నొక్కడం మోదీకి అలవాటుగా మారిందని, నిర్బంధాలు ఎక్కువైతే తిరుగుబాటు తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. శంషాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ అరెస్టు, కాంగ్రెస్ పార్టీ బ్యాంకు ఖాతాలను సీజ్‌కు నిరసనగా సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలు లేకుండా చేయాలనే కుట్రలో భాగంగా కేంద్రంలోని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్షాల నాయకులపై అక్రమ కేసులు నమోదు చేసి వేధింపులకు గురిచేస్తున్నదని విమర్శించారు. దేశ ప్రజలు మోదీ పనితీరును ఎప్పటికప్పుడు గమనిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈడీ, సీబీఐ పేరుతో ప్రతిపక్ష పార్టీల నాయకులను లేకుండా చేయాలని చూస్తున్న నరేంద్రమోదీనే లేకుండా చేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రాచారి, రాష్ట్ర కమిటీ సభ్యుడు పర్వతాలు, యాదిరెడ్డి, అప్పర్, యాదయ్య, రామస్వామి, రామకృష్ణ, లక్ష్మణ్, జైపాల్‌రెడ్డి, శంషాబాద్ మండల కార్యదర్శి యాదగిరి పలువురు నాయకులు పాల్గొన్నారు.

మోదీకి వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జంగయ్య, నాయకులు